www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 27 మే 2025 8 పేజీలు

వైఎస్ఆర్

అన్నమయ్య

మహానాడుకు సర్వం సిద్ధం

- ప్రతినిధుల సభతో మహా సంబరం ప్రారంభం
- 29న ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ
- పొంచి ఉన్న అల్పపీడనం ముప్పు
- కడపకు చేరుకున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

టిడిపి మహానాడుకు సర్వం సిద్ధమైంది. కమలాపురం నియోజకవర్గం చింతకొమ్మదిన్నె మండలంలోని పబ్బాపురం ఈ వేడుకలకు వేదికైంది. మంగళవారం నుంచి మూడ్రోజులపాటు నిర్వహించనున్న మహానాడు కార్యక్రమం 8.30 గంటల సమయంలో ప్రతినిధుల సభతో మొదలుకుని, పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా కార్యకర్తకు పెద్దపీట వేస్తున్నామనే పేరుతో రూపొందించిన ఆరు సూత్రాల ప్రశ్నావళి ఆవిష్కరణపై లోతైన చర్చ, మరుసటిరోజు భారీ బహిరంగ సభ నిర్వహణతో కార్యక్రమం ముగియనుంది. సోమవారం సాయంత్రం సభా వేదిక ప్రాంగణానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, నారా లోకేష్ రానున్నారు. మొదటిరోజు ప్రతినిధుల సభ ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రితోపాటు, నారా లోకేష్, పొలిట్‌బ్యూరో సభ్యులు, వేదికపై చేరుకుని పార్టీ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి కీ.శే ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తారు. అనంతరం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నివేదిక సమర్పిస్తారు. అనంతరం టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు స్వాగతోపన్యాసం చేయనున్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉపన్యాసం చేస్తారు. నారా లోకేష్ రూపొందించిన ఆరు సూత్రాల ప్రశ్నావళిపై చర్చ నిర్వహించనున్నారు. మధ్యాహ్నానంతరం ఆరు సూత్రాల్లో కీలకమైన 2లో

ఇక వైఎస్ఆర్ కడప జిల్లా 5లో

చిన్నారులపై కామాంధుడి లైంగిక దాడి 5లో

నేడు ఎపి ఇఎపి సెట్ ప్రవేశ పరీక్ష 5లో

శాస్త్రీయ విద్యావిధానం కోసం పోరాడాలి 8లో

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి 8లో

ముస్తాబైన కడప నగరం

మహానాడుకు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి) కార్యకర్తే అధినేత, యువగళం సూత్రాలపై లోతుగా చర్చించనున్నారు. రెండవ రోజు ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఘన నివాళి అర్పించనున్నారు. అనంతరం తెలుగుజాతి-విశ్వ విఖ్యాతి, స్త్రీశక్తి, సామాజిక న్యాయం, పేదల ప్రగతి అన్నదాతల అవస్థలపై చర్చించి 14 తీర్మానాలు చేయనున్నట్లు తెలుస్తోంది. తర్వాత జాతీయ అధ్యక్షుని ఎన్నిక అనంతరం అధ్యక్షుని ప్రసంగం చేయనున్నట్లు తెలుస్తోంది. చివరి రోజైన గురువారం మధ్యాహ్నంతరం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు ఐదు లక్షల మందితో భారీ బహిరంగసభ నిర్వహించనున్నారు.

క(గ)డప పసుపుమయం

కడప గడప పసుపుమయంగా మారింది. కడప నగరంలోని రహదారులు, కూడళ్లన్నీ పసుపు జెండాల రెపరెపలాడుతున్నాయి. ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేష్ చిత్రాలతో కూడిన భారీఫ్లెక్సీలు, భారీ కటౌట్లతో శోభాయమానంగా మారింది. ఇదిలాఉండగా మహానాడు వేదికకు మంత్రులు, పలు కార్పొరేషన్ ఛైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర సీనియర్ నాయకుల పరిశీలనలతో కళకళలాడుతోంది.

ఐదు వేల మందితో భారీ భద్రత

మహానాడు మొదటిరోజైన ప్రతినిధుల సభకు 23 వేల మంది, భారీ బహిరంగసభ వేదికపైన 450 మంది, బహిరంగసభకు హాజరు కానున్న ఐదు లక్షల మందికి అన్ని రకాల వసతి సదుపాయాలను ఏర్పాటు చేశారు. వీరి భద్రతకు సంబంధించి ఐదు వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పి పేర్కొన్నారు. మహానాడు ప్రాంగణ సమీపంలో 32 గ్యాలరీల్లో 3 లక్షల సీటింగ్ సదుపాయం, 200 సిసి కెమెరాలతో నిఘా, 28 చోట్ల వేలాది వాహనాలకు పార్కింగ్, 15 చోట్ల చెక్‌పోస్టులతో ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. మహానాడు నిర్వహణకు సంబంధించిన మూడ్రో జులకు సంబంధించి భారీగా భోజన, వసతి, పార్కింగ్ తదితర సదు పాయాలను కల్పించారు.

పొంచి ఉన్న అల్పపీడన ప్రభావం

మహానాడు కార్యక్రమ నిర్వహణకు అల్పపీడన ప్రభావం పొంచి ఉంది. ఐఎండి సూచనల మేరకు ఈ నెల 27వ తేదీన అల్పపీడన ప్రభావం చూపించే అవకాశం ఉందని తెలిపింది. ఇందుకు అను గుణంగానే మూడ్రోజులుగా మహానాడు వేదికపై వరుణుని ప్రభావం కనిపిస్తోంది. మహానాడు ప్రాంగణం వ్యవసాయక్షేత్రాలను తలపిస్తున్న నేపథ్యంలో మోస్తరు వర్షపాతం నమోదైతే బురదమయంగా మారే అవకాశం కనిపిస్తోంది.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో మూడు రోజులపాటు నిర్వహించే మహానాడు కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి కడప విమానాశ్రయానికి సాయంత్రం 7:35 గంటలకు చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. కడప విమానాశ్రయంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ముఖ్యమంత్రికి.. పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మహానాడు ప్రాంగణానికి సాయంత్రం 7.40 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు.

గ్రంథాలయాలను ఆధునికీకరణ చేస్తాం

- రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ జి.కోటేశ్వరరావు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాలను ఆధునికీ కరిస్తామని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ జి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని గ్రంథాల యాలను రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయం, ఓం శాంతి నగర్ లోని మహిళా గ్రంథాలయం సందర్శించినట్లు తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలోని విద్యార్థులతో ముచ్చ టించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో నేర్చుకొన్న విషయాలను పిల్లలు చెప్పారు. అలాగే రెఫరెన్సు సెక్షన్‌లో డిఎస్‌సి, కానిస్టేబుల్‌కు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగుల యువతతో మాట్లాడారు. విద్యార్థులకు కావాల్సిన పోటీ పరీక్షల పుస్తకాలు, ఇంకా కావాల్సిన పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని కార్యదర్శి యస్. అమీరుద్దీన్‌కు సూచించారు. నూతన భవన నిర్మాణానికి ప్రస్తుతం కోటి రూపాయలు నిధులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. పాఠకులకు కావాలసిన అని సౌకర్యాలతో కూడిన నూతన భవన ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళా గ్రంథాల యంలో ఉన్న పాఠకుల అభిప్రాయాలూ, సూచనల మేరకు తగిన చర్యలు తీసుకుంటాని చెప్పారు. గ్రంథాలయాలకు సంబంధించిన అన్ని వివరాలతో కూడిన వెబ్ సైట్, విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, మహిళలు, ఉద్యోగులతో వారి అభిప్రాయం మేరకు కొత్త పుస్తకాల కొనుగోలులో ప్రథమ ప్రాధాన్యత తీసుకుంటామని పేర్కొన్నారు. 6 జిల్లాలోని అన్ని లైబ్రరీ లకు శిక్షా ఫౌండేషన్ వారి సౌజన్యంతో కంప్యూటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంతో మాట్లాడి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు తన వంతుగా చేస్తాని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి యస్. అమీరుద్దీన్, అసిస్టెంట్ లైబ్రేరియన్ నాదెండ్ల బాబ్జి, నవాబ్ జాన్, జేమ్స్, మనోహర్ రావు, గౌస్, రమణ, శేఖర్ రెడ్డి, పదవిరమణ చేసిన ఉద్యోగులు యస్.రంగనాథ్, కె .శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఛైర్మన్ కోటేశ్వరరావు

ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

- కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం ఖాతాదారులు ఆధార్‌తో బ్యాంకు ఖాతాలను అనుసంధానం చేసుకోవాలని కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ పేర్కొన్నారు. సోమవారం ప్రజాశక్తితో మాట్లాడుతూ ఈ మేరకు ప్రభుత్వం తపాలా శాఖకు లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు నేరుగా నగదు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తుందని చెప్పారు. ఖాతాను

ఎన్‌పిసిఐ విధానం కింద ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో సుమా రు 51 లక్షల మంది బ్యాంకు ఖాతాలు సీడింగ్ లేని కారణంగా తమ శాఖ ఆధ్వర్యంలో గత ఏడాది స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని పేర్కొన్నారు. తపాలా శాఖ, సచివాలయ సిబ్బంది, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సమన్వయంతో జూన్ 5న ఆధార్ సీడింగ్ ఎన్‌పిసిఐ లింక్ కేజీ తిరగడంతో పాటు వారికి నూతన పోస్టల్ బ్యాంకింగ్ ఖాతాలు తెరవనున్నట్లు చెప్పారు. ఆధార్ సీడింగ్ చేసిన పోస్టల్ సేవింగ్ ఖాతాల పథకాల నగదు ఏ పోస్ట్ ఆఫీస్ లోనైనా తీసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దాడులపై మహానాడులో చర్చించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఎస్‌సి, ఎస్‌టిలపై చోటు చేసుకుంటున్న దాడుల గురించి మహానాడులో చర్చించాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు రఘు, జబ్బార్ కోరారు. సోమవారం కెవిపిఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, నాయకులు రాష్ట్రంలో దళితులపై అనేక చోట్ల దాడులు చేయడం, భూములు, స్థలాలు, ఎసిజెడ్లు భూములు, మాదిగ మాన్యం భూములు, స్థలాల పై నియో జవర్గం తెలుగుదేశం కార్యకర్తలు ఆక్రమించుకోవడం, దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహానాడులో ముఖ్యమంత్రి కార్యకర్తలను గట్టిగా ఎస్‌సిల జోలికి, భూములు, స్థలాల జోలికి పోవద్దని, దాడులు చేయొద్దని, కార్యకర్తలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

మహానాడు వేదికగా కడప ఉక్కుపై స్పష్టత ఇవ్వాలి : డివైఎఫ్ఐ

మహానాడు వేదికగా తెలుగుదేశం ప్రభుత్వం ఇవ్వాలని కడప ఉక్కు పరిశ్రమపై స్పష్టత ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని కోరారు. సోమవారం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కడప ఉక్కు పైన కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. విభజన హామీల ప్రధాన హక్కు అయినటువంటి కడప ఉక్కుని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని తెలిపారు. ఇక్కడ ప్రాంత యువతను మోసం చేసిందని అన్నారు. కడప ఉక్కు పరిశ్రమ వస్తే ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాది మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉందన్నారు. కరువు సీమలో ఈ ఉపాధి పరిశ్ర మలు వస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి లభించే అవకాశం ఉంటుందన్నారు. కడప వేదికగా జరిగే మహానాడులో టిడిపి ప్రభుత్వం కడప ఉక్కుపోయిన స్పష్టత ఇవ్వాలని డివైఎఫ్ఐ గా డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు ఉదయ్, మా బాషా పాల్గొన్నారు.

సిఎం సార్ పాస్టర్ల సమస్యలను పరిష్కరించండి

కడప : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాస్టర్ల సమస్యలను పరిష్కరించాలని, ప్రతినెలా గౌరవ వేతనం అందేలా కృషి చేయాలని న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి. మహేష్ కోరారు. కడప నగరం 48 డివిజన్ కృపా కాలనీలో సోమవారం ఏర్పాటు చేసిన ముఖ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప మహానాడుకు వస్తున్న సిఎం చంద్రబాబు పాస్టర్ల సమస్యలపై దృష్టి పెట్టాలని, క్రైస్తవులకు సూపర్ సిక్స్ లో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా పాస్టర్లకు 7 నెలల గౌరవేతనం మాత్రమే అందిందని, మైనారిటీ నిధులు చర్చి నిర్మాణాలు, మరమ్మతులు, ప్రభుత్వం ద్వారా పాస్టర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని పేర్కొన్నారు. గౌరవ వేతనం కోసం కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులైన పాస్టర్లకు ఆన్‌లైన్ ఓపెన్ చేయాలని, మైనారిటీ నిధులు పక్కదోవ పట్టకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

గిన్నిస్ రికార్డుపై ఎల్ఐసి సిబ్బంది సంబరాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : 2025, జనవరి 20న ఒక్క రోజులో అత్యధిక పాలసీలు సేకరించిన జీవిత బీమా సంస్థగా ప్రపంచ రికార్డు సాధి ంచడం ఎల్ఐసి ఏజెంట్ల సత్తాకు, సిబ్బంది నిబద్ధతకు, కష్టమర్ల నమ్మకానికి ప్రతీక అని ఎల్ఐసి కడప డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.కె.ఆర్.వి రవికుమార్ అన్నారు. సోమవారం ఎల్ఐసి డివిజనల్ కార్యాలయ ఆవరణలో గిన్నిస్ రికార్డు బ్యానర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, ప్రపంచంలో ఎన్నో జీవిత బీమా సంస్థలు ఉన్నప్పటికీ, ఎల్ఐసి మాత్రమే ఛైర్ పర్సన్ సిద్ధార్థ మహంతి పిలుపు మేరకు ఈ అరుదైన సంచలనాన్ని సృష్టించడం గర్వకారణమన్నారు. ఆరోజు దేశవ్యాప్తంగా 4,52,839 మంది ఏజెంట్లు 5,88,107 పాలసీలు సేకరించడంతో ఈ అపూర్వమైన రికార్డు సృష్టించడం సాధ్య మైందని తెలిపారు. ఈ గిన్నిస్ రికార్డుకు సంబంధించిన ధ్రువపత్రాన్ని ఆ సంస్థ ప్రతినిధులు మే 24న ముంబైలో ఎల్ఐసి సిఇఒ సిద్ధార్థ మహంతికి అందజేశారని పేర్కొన్నారు. కడప డివిజన్ మరిన్ని రికార్డులు సాధించే దిశగా ఈ ఆర్థిక సంవత్సరంలో పనిచేద్దామని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్లు సత్య ప్రసాద్, సత్య శ్రీనివాస్, చంద్రశేఖర, మేనేజర్లు సాల్మన్ రాజు, వెంకట కృష్ణ పాల్గొన్నారు.

జిల్లా సమస్యల మీద దృష్టి పెట్టండి : డిసిసి

ప్రజాశక్తి - కడప : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కడప జిల్లా సమస్యల మీద దృష్టి పెట్టాలని డిసిసి అధ్యక్షులు ఎన్. డి. విజయ జ్యోతి అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఇందిరా భవన్ లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో విజయ జ్యోతి మాట్లాడారు. ఒక వైపు కడప జిల్లాలో మహా నాడు నిర్వహిస్తూ మరొక వైపు టిడిపి కడప జిల్లాకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. జిల్లాలో అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా సగిలేరు ప్రాజెక్టు ద్వారా బద్వేల్ చెరువు కు నీరు చేరేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సోమశిల లిఫ్ట్ ప్రాజెక్ట్ ద్వారా 1 టిఎంసి నీరు బద్వేల్ చెరువుకు అంది చాలన్నారు. అన్నారు.బద్వేల్ ఇంజినీరింగ్ కళాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పోరుమామిళ్ల ప్రధాన రోడు పనులు పూర్తి చేయాలని చెప్పారు. కలస పాడు రాచేరు అభివృద్ధి చేయాలన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గానికి సంబం ధించి విభజన చట్టం ప్రకారం కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు కాలేదు. స్టీల్ ప్లాంట్ పనులను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మైలవరం టెక్స్టైల్ పార్క్ ప్రారంభించాలన్నారు. కమలాపురంలో రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులు వెంటనే ప్రారంభించాలని చెప్పారు. కడప–అనంతపురం రహదారి నుంచి కొప్పర్తి కారిడార్‌కు రోడ్డు కనెక్టివిటీ కల్పించాలని పేర్కొన్నారు. మైదుకూరు నియోజకవర్గానికి సంబంధించి కెపి ఉల్లిపాయల కొనుగోలు కేంద్రాన్ని శాశ్వతంగా ఏర్పాటు చేయాల అన్నారు. మహానాడులో పైన పేర్కొన్న అన్యా యాలలో కనీసం కొన్నింటినైనా పరిష్కరి ంచాలని విజయజ్యోతి కూటమి ప్రభుత్వానికి సూచించారు. విలేకరుల సమావేశంలో డిసిసి ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ల బాబు, క్రిస్టియన్ మైనార్టీ జిల్లా ఛైర్మన్ సంజయ్ కాంత, మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నీలం, ఓ బి సి జిల్లా ఛైర్మన్ చిన్న కుల్లాయప్ప, జిల్లా మైనార్టీ అధ్యక్షులు రహమతుల్లా ఖాన్ నగర మైనార్టీ అధ్యక్షులు ముబారక్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, సుశీల్ కుమార్, పాలగిరి శివ, పాల్గొన్నారు.

అఘాయిత్యాలను ప్రభుత్వం అరికట్టాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ఇటీవల కాలంగా మహిళలు, చిన్నారులపైన లైంగిక దాడులు చోటు చేసుకుంటున్నాయని, వీటి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర అంగన్వాడీ వర్కర్స్, మినీ వర్కర్స్ హెల్పర్స్ సంఘం అధ్యక్షురాలు జె.గంగావతి పేర్కొన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. బెల్ట్ షాపులు గ్రామాల్లో విచ్చలవిడిగా వెలిశాయన్నారు. గంజాయి అమ్మకాలు కూడా అధికంగా ఉంటున్నాయని తెలిపారు. వీటి కారణంగా మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహిళల కోసం ప్రత్యేక చట్టాలు ఎన్ని ఉన్నా, కఠిన శిక్షలు అమలు చేయకపోవడంతోనే అఘాయిత్యాలు అధికమవుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుని, మహిళలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

మహానాడుకు తరలిరండి

ప్రజాశక్తి - ఖాజీపేట

కడప నగరంలో మంగళవారం నుంచి మూడో రోజులపాటు జరగనున్న మహానాడు కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని టిడిపి మండల సీనియర్ నాయకులు సంధుల నాగశివారెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ ఛైర్మన్ శ్రీరాములయాదవ్, రాష్ట్ర ముస్లిం మైనారిటీ నాయకులు సర్వర్ ఖాన్‌పేటకు చెందిన కమలాపురం ఫరూక్ అహ్మద్, సిద్దారం ఖాదీరుల్లా, మైదుకూరు నియోజకవర్గ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తుట్టే రాము యాదవ్ వేర్వేరు ప్రకటనల్లో పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ కార్డు తప్పక వెంట తెచ్చు కోవాలన్నారు. మహానాడు కార్యక్రమం ఒక పండుగ వాతావరణంలో జరుగుతోందని. పార్టీ ప్రతి ఒక్కరికీ ఆహ్వానం అందించిందన్నారు. రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరగని రీతిలో మహానాడు వేడుక కార్యక్రమం జరగనుందన్నారు.

అన్నదానానికి సహకరించాలి

- ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానం ఆవరణలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్ కోరారు. సోమవారం భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లాడుపల్లె దేవళాలు అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దాతలు ముందుకు వచ్చి కార్యక్రమానికి సహకరించాలన్నారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకి సేవను నిర్వహించారు. కార్యక్రమంలో రత్నాకర్ రెడ్డి, కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వీరనారాయణ యాదవ్

వ్యక్తిగత విభేధాలు మాని అభివృద్ధికి కృషి చేయాలి

మాట్లాడుతున్న సమన్వయ కర్త ఇర్ఫాన్ బాషా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పార్టీలు, వర్గాలు, వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి ప్రొద్దుటూరు పట్టణాభివృద్ధికి కూటమి నాయకులు కృషి చేయాలని స్థానిక కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఇర్ఫాన్‌బాషా పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రధాన సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఇర్ఫాన్‌బాషా మాట్లాడుతూ ప్రొద్దుటూరులో ఆగిపోయిన కూరగాయల మార్కెట్ పనులు ప్రారంభించాలని కోరారు. పాత పడిన మంచి నీటి పైపులైన్ మార్పుడంతోపాటు మురుగునీటి ప్రధాన కాలువలను ఆధునీకరణ చేయాలన్నారు. కడప స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. వందేళ్ల చరిత్ర ఉన్న ప్రొద్దుటూరు పురపాలక సంఘం అభివృద్ధిలో శూన్యమన్నారు. కూటమి సర్కారులో అభివృద్ధి, సంక్షేమం ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం అడ్డుకోవడం శోచనీయమన్నారు. మురుగు నీరులో పైపులైన్ ఉండడంతో ప్రజలు అనారోగ్య పాలయ్యే అవకాశం ఉందన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఎమ్మెల్యే టిడిపి ప్రతినిధిగా ఉన్నారే తప్పా, అభివృద్ధిపై మాత్రం దృష్టి పెట్టలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి ఒక్క పైసా నిధులు మంజూరు చేయించలేదని చెప్పారు. సూపర్‌సిక్స్‌తో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారో చెప్పాలని ప్రశ్నించారు.

స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని తీర్మానించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని మహానాడులో తీర్మానం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ కోరారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని మూడుసార్లు శిలాఫలకాలికే పరిమితం చేశారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప, స్టీల్ ప్లాంట్ మాత్రం పురోగతి లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో కొనసాగుతూ ఉంది. కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు కడపలో జరిగే మహానాడులో జిల్లాలోని ఎమ్మెల్యేలు అందరూ పట్టుబట్టాలని, తీర్మానం చేయించి పనులు మొదలుపెట్టాలని ఆయన కోరారు. రాష్ట్రం విడిపోయే సందర్భంగా మేనిఫెస్టోలో కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని పొందుపరిచినట్లు ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం మహానాడులో తీర్మానం చేసి కేంద్రంలో బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. ఈరోజు ఎక్కడ చూసినా వ్యాపారాలు లేని పరిస్థితి కనిపిస్తోందన్నారు. ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నంగా ఉందన్నారు. రియల్ ఎస్టేట్ కుప్పకూలిందన్నారు. ఈ పరిస్థితుల్లో కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ తప్ప మరో మార్గం లేదని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యుడు ఎం బాబు, శేఖర్, రాములమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

వ్యర్థాలతో భరించలేని దుర్వాసన

కుందూ వంతెన వద్ద పడేసిన చికెన్, ఇతర వ్యర్థాలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో వ్యర్థ పదార్థాల వల్ల భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. అటువైపు వెళ్లేవారు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ముఖ్యంగా కుందూ నది సమీపం, గుండ్ల వంక, ద్వారకా నగరం, సీతారామపురం వద్ద వ్యర్థ పదార్థాలను రోడ్డు పక్కన పడేస్తున్నారు. చికెన్ వ్యర్థ పదార్థాలు, ఇంటి అవసరాలకు వినియోగించిన పదార్థాలు రోడ్డు వెంబడి వేస్తుండడంతో దుర్వాసన అధికంగా వస్తూ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గుండ్ల వంక మార్గాన ప్రయాణించేవారు ఆ ప్రాంతానికి వెళ్లగానే దుర్వాసన తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ స్పందనలేదు. మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రాంతాల చికెన్ వ్యాపారులు కూడా వ్యర్థ పదార్థాలను కుందూ నది సమీపంలో ఎవరూ లేని సమయంలో పడేస్తున్నారు. ప్రజలకు ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి . గ్రామాల్లో వివిధ పదార్థాలను కూడా స్వచ్ఛభారత్‌లో భాగంగా ఏర్పాటు చేసిన చెత్త నుండి సంపద కేంద్రాల్లో వేయకుండా ఇష్టం వచ్చిన ప్రదేశాల్లో పడేస్తున్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా నియమించిన క్లాప్ మిత్రలు పారిశుధ్యానికి సంబంధించి సక్రమంగా పనులు చేయడం లేదు. వ్యర్థపదార్థాలు ఎక్కడ చూసినా కుప్పలుతెప్పలుగా కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వివిధ ప్రదేశాల్లో వ్యర్థ పదార్థాలు వేయకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రైతుల చూపు.. ఉద్యాన పంటల వైపు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఇటీవల కాలంగా రైతులు సాధారణ పంటలకు స్వస్తి పలుకుతూ.. ఉద్యాన పంటల సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడం కోసం ప్రత్యేకంగా రాయితీలు కల్పిస్తోంది. ఉద్యాన పంటల సాగు ప్రోత్సాహం కోసం వివిధ రకాల పంటలకు వివిధ మొత్తాలలో రాయితీలను కల్పిస్తుంది. మామిడి, దానిమ్మ పంటలకు హెక్టారుకు (రెండున్నర ఎకరా) రూ.50వేలు, జామకు రూ.80,000, నిమ్మ, నారింజ పంటలకు రూ.50,000, సీతాఫలం పంటకు రూ.30,000, సపోటాకు రూ.17000, అరటికి రూ.70,000, బొప్పాయికి రూ.30,000, డ్రాగన్ ఫ్రూట్స్‌కు రూ.2,70,000, ఉసిరి, నేరేడు, అవకాడో, అత్తి పంటలకు రూ.50,000, చింతపండు, పనస పంటలకు రూ.30,000 ప్రకారం ప్రోత్సాహకంగా అందిస్తుంది. మండల వ్యాప్తంగా నాగసానపల్లి, కొత్తపేట, కూనవారిపల్లి, మైదుకూరు సమీపంలోని కేశలింగాయపల్లె, భూమాయపల్లి, దువ్వూరు మండలంలోని పలుచోట్ల ఎక్కువగా అరటి, బొప్పాయి సాగు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహం కల్పించడం పట్ల ఆ ప్రాంత రైతులు ఉద్యాన పంటల సాగు వైపు మక్కువ చూపుతున్నారు. మండలంలో దాదాపు 700 ఎకరాలకు పైబడి అరటి సాగు చేశారు. నాగసానిపల్లిలో బొప్పాయి పంటను రైతులు ఎక్కువగా చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఉద్యాన సాగు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాగులో ఉన్న అరటిపంట

చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

'పేద ప్రజలను ప్రభుత్వం ఆదుకుంటుంది'

ప్రజాశక్తి - చాపాడు

పేద ప్రజలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. మైదుకూరు నియోజకవర్గ పరిధిలో సిఎం సహాయక నిధి కింద 38 మంది బాధితులకు రూ.48.55 లక్షల చెక్కులను పార్టీ కార్యాలయంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌టిఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అన్ని రకాల సేవలకు ఉచితంగా వైద్యం అందిస్తుందన్నారు. పథకం ద్వారా వైద్య సేవలు అందని వారు ఆర్థికంగా నష్టపోకుండా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, మైదుకూరు మండల శాఖ అధ్యక్షులు భీమయ్య, పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, ఖాజీపేట మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, టిడిపి నాయకులు వైవి సుబ్బారెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

మహానాడుకు ఇంత ఆర్భాటం, దుబారా అవసరమా..?

- పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కడపలో టిడిపి నిర్వ హిస్తున్న మహానాడుకు ఇంత ఆర్భాటం, దుబారా, అట్టహాసం అవ సరమా అని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి ప్రశ్నించారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి నాయకులు మహానాడు కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ డబ్బు విచ్చలవిడిగా దుబారా చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని 11 నెలల కాలంలో అప్పుల కుప్ప చేసినందుకా మహానాడు అని ప్రశ్నించారు. 2024-25లో లక్ష కోట్లు, 2025-26లో రూ1.50 వేల కోట్లు అప్పు చేసినందుకు, చేస్తున్నందుకా అన్నారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.15,480 కోట్లు అదనపు భారం మోపి వీర బాదుడు బాదినందుకా అన్నారు. మండలానికి 4 మద్యం షాపులు, 40 బెల్టు షాపులు పెట్టి రాష్ట్రాన్ని మద్యాంధ్ర ప్రదేశ్ చేసినందుకా అని ఎద్దేవా చేశారు. పాఠశాలల్లో కూడా డ్రగ్స్, గంజాయి ప్రవేశించాయన్నారు. హామీలు అమలు చేయనందుకా మహానాడు నిర్వహించేది అన్నారు. ఇచ్చిన హామీలకు సమాధానం చెప్పాలని చంద్రబాబును, టిడిపి నాయకులను తులసిరెడ్డి నిలదీశారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - చాపాడు

వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు గ్రంథాలయ అధికారి జె.శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఇఒ వంశీకృష్ణ మాట్లాడుతూ ధ్యానం వల్ల సంపూర్ణ ఆరోగ్యం, ఏకాగ్రత సాధ్యమన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని అంశాలను బోధిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బిడిసి రవిశంకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఇఒ వంశీకృష్ణ

నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రసాద్‌కు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో వైసిపి నాయకులు నగర్తి ప్రసాద్ తల్లి ఉప ఎంపిపి సుందరమ్మ ఇటీవల మృతి చెందారు. అప్పట్లో అందుబాటులోలేని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి సోమవారం సుందరమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైసిపి నాయకులు వద్దరాల సురేష్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మయ్య, జడ్పీటీసీ శాంతరాజు, వైసిపి నాయకులు మనోహర్, రమణయ్య, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

పిల్లలకు బోధిస్తున్న గజ్జల వెంకటేశ్వర్‌రెడ్డి

విద్యాదానం మిన్న

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అన్ని దానాల కన్నా విద్యా దానం మిన్న అని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గజ్జల వెంక టేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రామేశ్వరం గ్రంథాల యంలో సోమవారం నిర్వహించిన సమ్మర్ క్యాంపులో ఆయన పిల్లలకు బోధించారు. అనంతరం వెంకటేశ్వరరెడ్డి మాట్లా డుతూ శ్రేయస్సు కోరే వారిలో తల్లిదండ్రుల తర్వాత స్నేహితుడు అని మైత్రి బంధాన్ని వివరించారు. శిక్షకులు నాగర్జున, అరవింద్ విద్యార్థులకు జిరాఫీ చెస్, క్యారం బోర్డు, పరమపద సోపానంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ ఇబ్రహీం సాహెబ్, ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్,విద్యార్థులు పాల్గొన్నారు.

బిసిల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన ఆర్.కృష్ణయ్య

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్

జాతీయ బిసి సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు ఆర్.కృష్ణయ్య జనగణనతోపాటు కులగణన జరపాలని లోకసభలో కేంద్ర ప్రభుత్వం ఆమోదం పొందేలా పోరాడారని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బిసిల ఆత్మీయ సమ్మేళనం సభను సోమవారం కెసి పుల్లయ్య హాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జాతీయ బి.సి సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు ఆర్ కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వర రావు, రాష్ట్ర ఇన్‌ఛార్జి జాతీయ బిసి సంక్షేమ సంఘం యలగాల నూకనమ్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సోమ లక్ష్మీ నరసయ్య, సందు శివ నారాయణ, వెంకటరమణ రాజు, కత్తి విజయకుమార్, రమేష్ రాజు, రామసుబ్బా యాదవ్, పుల్లయ్య, వెంకటసుబ్బయ్య, బాలకృష్ణ యాదవ్, ప్రభు కుమార్ పాల్గొన్నారు

థర్మల్ పైప్‌లైన్ నీటి వృథాను వెంటనే అరికట్టాలి

ప్రజాశక్తి - చాపాడు

బ్రహ్మంసాగర్ నుండి ఆర్‌టిపిపి వరకు 70 కిలోమీటర్లు పొడవునా చాలా ప్రదేశాల్లో నీటి వృథాను వెంటనే అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ మైదుకూరు నియోజకవర్గం కో-ఆర్డినేటర్ చాపటి రామ సుధాకర్ రెడ్డి కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ థర్మల్‌కు 40 క్యూసెక్కుల నీటిని సరఫరా చేసేలా ఏర్పాటు చేసిన పైపులైను ప్రస్తుతం నీరు చాలా ప్రాంతాల్లో వృథాగా పోతోందన్నారు. ముఖ్యంగా మైదుకూరు నుండి ఆర్‌టిపిపి వరకు వివిధ చోట్ల పైప్‌లైన్‌లో లీకులున్నాయన్నారు. పలుమార్లు మరమ్మతులు చేసి నప్పటికీ ఉపయోగం లేదన్నారు. ఆర్‌టిపిపి వారు దాదాపు నెలకు రూ.కోటి వరకు కరెంటు బిల్లు ఇతర నిర్వహణలకు ఖర్చు చేస్తున్నారన్నారు.

ఆధార్, బియ్యం కార్డుకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - ముద్దనూరు

ఆధార్ సేవలు పొందేందుకు, బియ్యం కార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. ముద్దనూరు-1,2 సచివాలయాలున్నాయి. ప్రజలకు ఆధార్ సేవలు అందించేందుకు అధికారులు ముద్దనూరు సచివాలయం-2లో శాశ్వత ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బియ్యం కార్డు కోసం కొత్తగా పెళ్లయిన వారు దరఖాస్తు చేసుకునేందుకు, కార్డులో మార్పులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆధార్ సేవలు, బియ్యం కార్డు కోసం ప్రజలు సచివాలయం-2 వద్ద బారులు దీరుతున్నారు. ఆధార్, బియ్యం కార్డు సేవల కోసం ప్రజలు సచివాలయం వద్ద గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. సచివాలయాల్లో సర్వర్ సరిగ్గా పని చేయకపోవడంతో బియ్యం కార్డు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన వారు గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తుంది. సర్వర్ సమస్య వల్ల బియ్యం కార్డు దరఖాస్తుకు ఆలస్యమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈలోగా ప్రభుత్వం నిర్దేశించిన గడువు ముగుస్తుందని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బియ్యం కార్డు దరఖాస్తు కోసం వెళితే సచివాలయం-2కి వెళ్లండని అంటున్నారని ప్రజలు వాపోతున్నారు. సచివాలయం-

రద్దీగా ఉన్న ప్రజలు

1లో కూడా బియ్యం కార్డు దరఖాస్తు సేవలు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. బియ్యం కార్డులో లబ్ధిదారులు విభజించుకునేందుకు హౌస్ హెూల్డ్ మ్యాప్‌లో నంబరు అడుగుతుంది. కొత్తగా ఇంటి నంబర్లు ఇవ్వక పోవడంతో చాలా మంది లబ్ధిదారులు నమోదు చేసుకోలేక పోతున్నారు. బియ్యం కార్డు దరఖాస్తు గడువు పెంచాలని ప్రజలు, లబ్ధిదారులు కోరుతున్నారు.

కనీవినీ ఎరుగని రీతిలో మహానాడు

మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కడపలో నిర్వహిస్తున్న మహానాడు కనీవినీ ఎరుగని రీతిలో జరుగుతుందని, అధికసంఖ్యలో తరలిరావాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాల యంలో సోమవారం భూపేష్ రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమా వేశం నిర్వహించారు. ముందుగా భూపేష్‌రెడ్డి పేరు ఫొటోతో కూడిన మహానాడు టి షర్ట్, స్టిక్కర్స్ విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కడపలో జరిగే మహానాడుకు ఆరు లక్షల మంది రావచ్చని అంచనా వేశామన్నారు. మహానాడు జన సమీ కరణ జమ్మలమడుగు నియోజవర్గం పరిశీలకులు ఎమ్మిగనూరు శాసనసభ్యులు జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 29న జరగబోయే మహానాడు బహిరంగ సభను అత్యధిక మందితో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంత్రి సవితమ్మను, ఎమ్మిగనూరు ఎమ్మెల్యేను రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ రాకేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లికార్జున, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడును సన్మానిస్తున్న అర్చకులు

గండి అంజన్నను దర్శించుకున్న మంత్రి

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని గండి అంజన్నను సోమవారం వ్యవసాయశాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు దర్శించుకున్నారు. మంగళవారం నుంచి మూడు రోజులపాటు కడపలో జరగబోవు మహానాడు కార్యక్రమంలో భాగంగా మంత్రి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా స్వామి మంత్రి కుటుంబ సభ్యుల పేరిట ప్రత్యేక పూజలు చేశారు. ఘనంగా సత్కరించారు. టిడిపి రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎస్ఎండి షబ్బీర్ మంత్రి అచ్చెన్నాయుడును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నందిపల్లి రామగంగిరెడ్డి, గోటూరు నాగభూషణం, మహబూబ్ షరీఫ్, శివయ్య, టిడిపి యూత్ వేణుగోపాల్ రెడ్డి, గంగాధర్ రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

ఇది చరిత్రలో నిలిచిపోయే మహానాడు

ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మంగళవారం నుంచి కడపలో నిర్వహించనున్న మహానాడు చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే ఎన్. వరదరాజులరెడ్డి తెలిపారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ మహానాడు ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మహానాడు పండుగ వాతావరణంలో జరగనుందన్నారు. ప్రొద్దుటూరు నుండి 300 బస్సులు, 200 కార్లు, 2000 మోటర్ బైక్‌ల ద్వారా తరలించనున్నామన్నారు. మహానాడు విజయ వంతం చేయటానికి 25 వేల మంది ఇక్కడి నుండి వెళ్లను న్నామ న్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున మహానాడుకు తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఇవి సుధాకర్‌రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ అసం రఘురామిరెడ్డి, బోయ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, మునిసిపల్ వైస్ చైర్మన్ జాబీవుల్లా పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి

టెండర్లతో స్థానికులకు ఇబ్బంది

ప్రజాశక్తి - కడప అర్బన్

హెచ్‌పిసిఎల్ కడప డిపో టెండర్లలో చెన్నై మాఫియా అక్రమాలకు పాల్పడడం వల్ల స్థానికులకు ఇబ్బంది కలుగుతుందని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. సోమవారం హెచ్‌పిసిఎల్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హెచ్‌పిసిఎల్ కడప డిపో టెండర్లలో చెన్నై మాఫియా అనేక అక్రమాలకు పాల్పడుతుందని తెలిపారు. దీని వల్ల స్థానిక ప్రజలు ఉపాధి కోల్పోతున్నారని చెప్పారు. తద్వారా వీరి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. 30ఏళ్లల్లో ఎప్పుడూ లేని విధంగా ఈ టెండర్లలో స్థానికులు ఇబ్బం దులుకు గురవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి జి.చంద్రా, ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శి ఎన్.రవిశంకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సత్తార్, ఆర్ఎస్ పి కార్యదర్శి సుబ్బారాయుడు, సిహెచ్‌ఆర్‌డి శివారెడ్డి, పరిశ్రమల శాఖ రిటైర్డ్ జిఎం గుర్రాల గోపాల్, విద్యుత్ శాఖ రిటైడ్ ఇఇ గురప్ప, ట్రాన్స్‌పోర్టర్స్ విజయ్ కుమార్, శంకర్, రామ్మూర్తి నాయక్, రమేష్, జడ, మోహన్, ప్రకాష్ నాయుడు, ఆంజనేయులు, ఎర్రిస్వామి, బసవలింగప్ప, గురుస్వామి, వీరనారాయణ, సిద్దయ్య పాల్గొన్నారు.

యోగాసనాలు వేస్తున్న కమిషనర్, మహిళలు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

యోగ ద్వారానే మనిషికి సంపూర్ణ ఆరోగ్యం అని మున్సిపల్ కమిషనర్ డి రాముడు అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. యోగా గురువు వెంకట రామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ వి.వరప్రసాద్ పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ యోగా వల్ల మానసిక ప్రశాంతత, శారీరక వ్యాయామం కలుగుతుందన్నారు.

సింహాద్రిపురం : యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపిడిఒ కృష్ణమూర్తి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాల యంలో సోమవారం మండలంలోని సచి వాలయ, ఉపాధి హామీ పథకం, డిఆర్‌డిఎ సిబ్బందికి యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజు యోగా చేయాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. యోగా ట్రైనరు జేసునాథరెడ్డి మాట్లా డుతూ యోగా చేయడం వలన ఆరోగ్య సమస్యలు తలెత్తే అవ కాశం ఉండదన్నారు. ప్రతిరోజు కుటుంబ సభ్యులందరూ యోగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఎపిఒ జయభారతి, డిఆర్‌డిఎ ఎపిఎం మంజునాథ పాల్గొన్నారు.

జిఎస్ మూర్తికి ఎమ్మెల్సీ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

టిటిడి లీగల్ కౌన్సిల్‌గా నియమితులైన కడప జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాది, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జిఎస్ మూర్తికి శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఎమ్మెల్సీని జిఎస్ మూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాంగోపాల్ రెడ్డి ఆయనను సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు లేపాక్షి విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ ఉద్యోగాలకు లేపాక్షి విద్యార్థులు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ రామచంద్రారెడ్డి తెలిపారు. సోమ వారం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ డిగ్రీ విద్యార్థులకు నిర్వహించిన ఆన్‌లైన్ ఇంట ర్వ్యూలలో ఎస్.గీతిక, టి.స్వాతిక ఎంపికైనట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

ఆత్మరక్షణకు తేక్వాండో

కడప అర్బన్ : ఆత్మరక్షణ, క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ తేక్వాండో శిక్షణతోనే సాధ్యమవుతుందని నగరపాలక ఉర్దూ మెయిన్ స్కూలు ప్రధానోపాధ్యాయులు మహాలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం నగరపాలక ఉర్దూ మెయిన్ పాఠశాలలో తేక్వాండో కోచ్‌లు షేక్.ఇర్ఫాన్, షేక్.రుక్సానా అధ్యక్షతన శిక్షణలో ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులకు కలర్ బెల్ట్స్ ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం, ఎస్ టి యు జిల్లా అధ్యక్షులు ఇలియాస్ బాషా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కడపలో తేక్వాండో విద్యార్థులకు మంచి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కోచ్‌లు ఇర్ఫాన్, రుక్సానా కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

నేడు ఎపి ఇఎపిసెట్ ప్రవేశ పరీక్ష

- గంటన్నర ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి

- కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

ప్రజాశక్తి - కడప : జిల్లాలో మహానాడ సభా కార్యక్రమాల నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 27న ఎపి ఇఎపిసెట్–2025 పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 7.30 గంటలలోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కెఒఆర్ఎం, అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ సైన్సెన్, కెఎస్ఆర్ఎం, కెఎల్ఎం ఇంజినీరింగ్ కళాశాల్లో పరీక్షలుంటాయని పేర్కొన్నారు. మహానాడు నిర్వహించే వేదికకు సమీపంలో పరీక్ష కేంద్రాలు ఉన్నందున పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అయినప్పటికీ ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా పటిష్ట ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు ముందు జాగ్రత్తగా ఈ నెల 27న ఉదయం 7.30గంటలలోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఒకవేళ ఏదైనా ట్రాఫిక్ సమస్యలు ఎదురైతే జిల్లా పోలీసు యంత్రాంగం వారు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ హెల్ఫ్ లైన్ నెంబర్లు : 9121100531(కమాండ్ కంట్రోల్), 9121100515 (ఎస్డిపిఒ కడప)కు పోన్ చేసి సాయం తీసుకోవచ్చన్నారు. పరీక్ష ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్న దృష్ట్యా సంబంధిత పరీక్షా కేంద్రాలు కేటాయించబడిన విద్యార్థులు ఏవిధమైన ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కోకుండా, ఒత్తిడికి గురికాకుండా ముందుగానే ఉదయం 7.30 గంటలలోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి : ఎఎస్పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఎఎస్పి ఎం. వెంకటాద్రి పేర్కొన్నారు. ఎస్పి విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్పి మాట్లాడుతూ వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధానమిస్తూ సత్వరమే విచారించి వారి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని వారు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అక్కడ కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదు గానే పరిగణించి సత్వర న్యాయం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీస్ అధికారులకు సూచించి సకాలంలో పరిష్కారం చేయాలని కోరారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎఎస్పి వెంకటాద్రి

చిన్నారులపై కామాంధుడి లైంగిక దాడి

ప్రజాశక్తి–జమ్మలమడుగు రూరల్

వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలో నాలుగురోజుల కిందట ఎ.కంబాల దిన్నెలో చిన్నారి హత్యాచార సంఘటన మరువక ముందే శివారెడ్డి కాలనీలో మరో దారుణం జరిగింది. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఐదేళ్ల వయసున్న ఇద్దరు బాలికలపై ఓ కామాంధుడు అఘాయిత్యానికి యత్నించాడు. ఇద్దరు పిల్లలపై అత్యాచారం చేయబోయాడు. పిల్లలు ఇద్దరు పెద్దగా కేకలు వేయడంతో పిల్లల తల్లిదండ్రులు చూసి తండ్రి వెంటబడి పట్టుకొని పోలీసుస్టేషనకు అప్ప జెప్పాడు. పిల్లల తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సకాలంలో పిల్లల తల్లిదండ్రులు గుర్తించడం, ఆ కామాంధుడికి దేహశుద్ధి చేసి జమ్మలమడుగు పోలీసులకు అప్పగించారు. నిందితుడు సయ్యద్ బాషా (23). ఇతను సిమెంట్ పని చేసేవాడని, ఇతని కుటుంబం గతంలో ఎర్రగుంటలో నివాసం ఉండే వారని పోలీసులు తెలిపారు. శివారెడ్డి నగర్‌లోని గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారన్నారు. నిందితుడు చిన్నపిల్లలపై అసభ్య కరంగా ప్రవర్తించాడని పోలీసులు తెలిపారు.

ఇక వైఎస్ఆర్ కడప జిల్లా

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్రంలోని కూటమి సర్కారు వైఎస్ఆర్ జిల్లా పేరును వైఎస్ ఆర్ కడప జిల్లాగా మారుస్తూ సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. 170 జిఒను జారీ చేసింది. ఇటీవల నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి. మాజీ సిఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం కడప జిల్లా పేరును వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్పు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి కడప పేరును తొలగించి వైఎస్ఆర్ జిల్లాగా మార్చింది. ప్రజల నుంచి వినతులు రావడంతో వైఎస్ఆర్ కడప జిల్లాగా నామకరణం చేస్తూ ప్రభుత్వం జిఒ విడుదల చేసింది.

అదుపుతప్పి బోల్తాపడిన కారు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు బోల్తా

- పలువురికి గాయాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిన కడప-రేణిగుంట జాతీయ రహదారిపై సోమవారం మరోసారి కారు అదుపు తప్పి బోల్తా పడడంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కడప నుంచి తిరుపతికి వెళుతున్న కారు జాతీయ రహదారిపై అనంతంపల్లి సమీపంలో అతివేగంగా వెళుతుండగా అదుపుతప్పడంతో రాంగ్ రూట్లో వెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టి పల్టీలు కొట్టింది. కారులో ఉన్న పలువురు గాయపడ్డారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలుస్తోంది. కారు ఢీకొనడంతో విద్యుత్ స్తంభం పూర్తిగా ధ్వంసం కావడంతో విద్యుత్తు లైను నేలకూలి సుమారు నాలుగు గంటలసేపు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనపై పుల్లంపేట ఎస్ఐని వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అవినీతికి పాల్పడ్డ 'ఉపాధి' సిబ్బంది

- ఐదుగురు టిఎలు, ముగ్గురు ఎఫ్ఎలు సస్పెన్షన్

ప్రజాశక్తి-గాలివీడు

జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా 19వ సామాజిక తనిఖీల్లో భాగంగా అవినీతికి పాల్పడ్డ ఐదుగురు టెక్నికల్ అసిస్టెంట్లు, ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపిడిఒ సి.ఎ.జవహర్‌బాబు తెలిపారు. సస్పెన్షన్ ఉత్తర్వులను సోమవారం వారికి అందించినట్లు తెలిపారు. అంద జేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సస్పెన్సన్ అయిన టెక్నికల్ అసిస్టెంట్‌లలో పురు షోత్తం, నాగరాజు, మల్లికార్జున, ఖాదర్ వలీ, బాలాజీ ఉన్నారని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంటల్లలో వెలిగల్లు జైచంద్రనాయక్, పూలుకుంట రతీదేవి, గుండ్లచెరువు పావనిని సస్పెండ్ అయి నట్లు తెలిపారు. బోరెడ్డిగారిపల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌పై కూడా ఉపాధి కూలీల దగ్గర డబ్బులు తీసుకున్నట్లు వీడియో అందిందని తెలిపారు. ఎపిఒ రామ చంద్రను విచారించాలని ఆదేశించినట్లు తెలిపారు. విచారణలో ఫీల్డ్ అసిస్టెంట్ కూలీల దగ్గర డబ్బులు తీసుకున్నారని తేలితే చర్యలు తప్పవని అన్నారు.

విద్యుదాఘాతంతో తాపీ మేస్త్రీ మృతి

ప్రజాశక్తి-పీలేరు

విద్యుదాఘాతంతో తాపీ మేస్త్రీ మృతి చెందిన సంఘటన సోమవారం పీలేరు మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ లోకేష్ కథనం మేరకు.. పీలేరు పట్టణం, మోడల్ కాలనీలో అక్సర్‌బాషా అనే తాపీ మేస్త్రి నివాసం ఉంటున్నాడని తెలిపారు. తనకు రోజువారి వచ్చే కూలీ డబ్బులతో కుటుంబాన్ని పోషించుకునేవాడని అన్నారు. సోమవారం పీలేరు - మదనపల్లి మార్గంలోని ఎపిఐఐసి లోని ఎన్‌టిఆర్ కాలనీలో ఇంటి నిర్మాణ పనులకు వెళ్లాడని అన్నారు. అక్కడ గోడలకు నీళ్లు పడుతుండగా పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడని అన్నారు. స్థానికులు గుర్తించి ఇతన్ని చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారని అన్నారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని తెలిపారు. మృతుడికి భార్య సనా ఫాతిమా, ముసాబ్, ఖలీజ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు.

35 సెంట్లు ప్రభుత్వ, ప్రయివేట్ స్థలం కబ్జా

ప్రజాశక్తి -నందలూరు

మండలంలోని పాటూరు పంచాయతీ 953 సర్వే నెంబర్‌లోని పట్టా భూమిలో 10 సెంట్లు, ప్రభుత్వ రస్తాలోని దాదాపు 25 సెంట్లు భూమిని కొంతమంది బడా నాయకులు కబ్జా చేశారని అదే గ్రామానికి చెందిన షేక్ ఆన్సర్ భాష సోమవారం తహశీల్దార్ పుల్లారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సంద ర్భంగా ఆన్సర్‌బాషా మాట్లాడుతూ 953 సర్వేనెంబర్ పక్కన ప్రభుత్వ రస్తా ఉందని, దాని పక్కనే 957 సర్వేనెంబర్ లోని భూమి యజమానులు ప్రభుత్వ రస్తాలోని కొంత భూమిని, తమ సర్వే నెంబర్ లోని కొంత స్థలాన్ని ఆక్రమించి తమకు తెలియకుండా అమ్మేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తహశీల్దార్ సర్వే చేసి ప్రభుత్వ రస్తాని, తమ స్థలాన్ని కబ్జా కోరల నుంచి కాపాడాలని విన్నవించినట్లు తెలిపారు.

ట్రాఫిక్ వలయంలో పెద్దూరు రోడ్డు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్ర గాలివీడులోని పెద్దూరు రోడ్డులో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ నుంచి పెద్దూరు మీదుగా దానంరెడ్డిగారిపల్లి వరకు వెళ్లే రోడ్డు ట్రాఫిక్ వలయంలో నిండిపోతుంది. నిత్యం ట్రాఫిక్ వలయంలో చిక్కుక పోతున్నామని అత్యవసర పరిస్థితుల్లో ఎక్కడికైనా వెళ్ళాలంటే సమస్య ఉందని వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2019వ సంవత్సరంలో ఆర్‌అండ్‌బి, రెవెన్యూ అధికారులు రోడ్డు సర్వే చేసి, రోడ్డు స్థలాన్ని ఆక్రమించిన వారి ఇంటి చుట్టూ సర్వే చేసి హద్దులు కూడా వేశారు. అయినా హద్దుదాటి గృహాలు, కాలువలు నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ఒక వాహనం వెళ్ళిందంటే ఎదురుగా వచ్చే ఆగిపోవాల్సిందేనని లేకుంటే తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని చెప్పారు. రాయచోటి డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు దానంరెడ్డిగారిపల్లి వరకు పోయి వస్తుంది. ఇక పాఠశాల స్కూల్ బస్సులు కూడా వచ్చిపోతుంటాయి. పంచాయతీ అధికారులు,

ఆక్రమణకు గురైన పెద్దూరు రోడ్డు

రెవెన్యూ అధికారులు, ఆర్‌అండ్ బి అధి కారులు చొరవ తీసుకొని సహకారంతో మురికి కాలువ ఆక్రమణ, రోడ్డు ఆక్రమణ తొల గించాలని ప్రజలు కోరుతున్నారు. లేకుంటే ట్రాఫిక్ నిరంతర సమస్యగా మారిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

25 ఏళ్ల దారి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - రాయచోటి : ప్రజల సమస్యలను అవగాహన చేసుకుని సమస్య మూలాలలోకి వెళ్లి వాటిని పరిష్కరించడానికి బాధ్యతగా కృషి చేసిన అధికారుల పట్ల కృతజ్ఞతతో పాటు ప్రభుత్వం పట్ల కూడా ప్రజలలో ఒక భరోసా, విశ్వాసం ఏర్పడుతుంది. ఇందుకు నిదర్శనంగా అన్నమయ్య కలెక్టర్ శ్రీధర్ చామకూరి చూపిన చొరవతో గ్రామంలో 25 ఏళ్ల గా నెలకొన్న దారి సమస్యకు పరిష్కారం లభించినందుకు గ్రామస్తులందరూ తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. వివరాలు. కోడూరు మండలం చియ్యవరం గ్రామంలో 10 కుటుంబాలకు చెందిన రైతులు తరతరాలుగా తమ పొలాలకు వెళ్లే కాలిబాట దారి ఉండేది. ఈ దారికి ముందుగా ఉన్న డికెటి భూమిని కొంతమంది ఆక్రమించుకొని కంచె ఏర్పాటు వేయడం వల్ల దారి సమస్య ఏర్పడింది. దీని పరిష్కారం కోసం సంవత్సరాలుగా ఎదురు చూసిన ఫలితం లేకపోయింది. అప్పటినుంచి పొలానికి దారి విషయమై గ్రామంలోని కొన్ని విభేదాల కారణంగా సమస్య క్లిష్టమై పరిష్కారం కాకుండా ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమంలో గ్రామస్తులు అర్జీ సమర్పించారు. సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సమస్యను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని జెసికి సూచించడంతో పాటు రైతులు, గ్రామస్తులతో మాట్లాడి ఎవరికీ ఇబ్బంది లేకుండా సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. పిజిఆర్ఎస్, రెవెన్యూ సదస్సుల వల్ల గ్రామంలో మేలు జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. పరిష్కారం చూపడంలో చొరవ చూపిన కోడూరు మండల తహశీల్దార్ మహబూబ్ చాంద్‌ను కూడా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డిఆర్ఒ మధుసూదన్ రావు, ఆర్‌డిఒ శ్రీనివాస్, ఎస్‌డిసి రాఘవేంద్ర, పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : ఫ్యూచర్ మైండ్స్ పాఠశాలలో సోమవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తిరుపతి అమర ఆస్పత్రి వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు గురజాల వెంకటేష్, పిజీసియన్ డాక్టర్ లోకేష్, ఎముకల సంబంధిత వైద్య నిపుణులు తిరుమలేష్ తదితర వైద్య నిపుణులు పాల్గొని సుమారు 140 రకాల వ్యాధులకు చికిత్సను అందించారు. రక్తపోటు, మధుమేహం, ఇసిజి వంటి తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు మాట్లాడుతూ అమర ఆస్పత్రి యాజ మాన్యం, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

శ్రీకాకుళం టిడిపి కార్యకర్తలకు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గతంలో వైసిపి కార్యకర్తల చేతిలో అవమానింపబడ్డ శ్రీకాకుళం టిడిపి కార్యకర్తలను సోమవారం మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 నవంబర్‌లో సిఎం చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ శ్రీకాకుళంకు ఆరుగురు కార్యకర్తలు నిద్రబంగి, రామకృష్ణారెడ్డి, ఆదినారాయణ, బోయి పెంటాయరెడ్డి, చిల్లరామ సూరి రెడ్డి, సరగడ రమేష్, నీలావు సుందర్ రావు శ్రీకాకుళం నుంచి కుప్పం వరకు సైకిల్ ర్యాలీ చేపట్టారని అన్నారు. టీ తాగేందుకు మార్గమధ్యంలోని పుంగనూరు మండలం సుగాలిమిట్ట ప్రాంతంలో ఆపి, విశ్రాంతి తీసుకుంటుండగా వారిపై వైసిపి నాయకుడు అసభ్య పదజాలతో దూషిస్తూ అధినాయకులను తీవ్రంగా దుర్భాషలాడి అవమానించారని అన్నారు. కడపలో జరుగుతున్న మహానాడు వేడుకులకు శ్రీకాకుళం పసుపు సైనికులు సైకిల్ యాత్ర ద్వారా బయల్దేరారు. అప్పుడు అవమానింప పడ్డ ప్రాంతం, మదన పల్లె మీదుగా కడపకు వెళుతున్న నేపథ్యంలో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సైకిల్ యాత్ర మీద వెళ్తున్న ఆరుగురిని తమ ఇంటి వద్దకు పిలిపించారు. వారిని శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెవి రమణ, నాగూర్‌వలి, (షో ఆప్‌శీనా) మల్లికార్జున నాయుడు, మేస్త్రిమల్లి, బెల్లె రెడ్డిప్రసాద్, బాలు స్వామి, కొత్తవారిపల్లి సహదేవ, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జడ్‌హెచ్‌డిసి భూములకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - గోపవరం

జడ్‌హెచ్‌డిసి భూములకు రక్షణ కల్పించాలని మండలంలోని మడకలవారిపల్లి గ్రామానికి చెందిన దళితులు కోరుతున్నారు. ఆదివారం వారు విలేకర్లతో తమ సమస్యలను విన్నవించారు. 1999లో ప్రభుత్వం దారిద్ర రేఖకు దిగువన ఉన్నారని గుర్తించి వారికి ఏక్సాల్ పట్టాలు ఇచ్చిందని చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 36 కుటుంబాల వారికి గోపవరం గ్రామ రెవెన్యూ పరిధి లోని సర్వే నెంబర్ 1854, 1855లలో ప్రభుత్వం జడ్‌హెచ్‌డిసి భూములలో ఒకొక్కరికి ఒకటిన్నర ఎకరా చొప్పున అందజేసిందని తెలిపారు. ఇప్పుడు రియల్ ఎస్టేట్ బాగా పెరగడం, సమీపంలోనే సెంచరీ ఫ్లైవుడ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడంతో తమ భూములకు డిమాండ్ వచ్చిందన్నారు.అది జీర్ణించుకోలేని అగ్రకులస్తులు భూములు చుట్టూ ఉన్న కంచెను ధ్వంసం చేశారన్నారు. వారి చర్యలపై తాము రెవెన్యూ, పోలీసు అధిఆరులు ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దళిత భూములకు రక్షణ కల్పించాలని, లేనిపక్షంలో దళిత సంఘాలను, కుల సంఘాలను, పార్టీలను,కలుపుకొని ఉద్యమం చేయడానికి ఎంత దూరమైనా వెళ్లడానికి మేము సిద్ధంగా ఉన్నామని బాధితులు వాపోతున్నారు

పాస్‌పోర్ట్ పోయినది

అన్నమయ్య జిల్లా, రాయచోటి టౌన్ మరియు మండలం,కొత్తపేట, డోర్ నెం: 51/120-సిలో నివాసం ఉంటున్న బి.చిన్న వెంకటరమణ గారి కుమారుడు బొగ్గుల రఘునాధకి చెందిన పాస్‌పోర్ట్ ఈనెల 10వ తేదీన రాయచోటి బస్టాండ్‌లో నాకు చెందిన ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెంబర్ **B744255** పోయినది. ఎవరికైనా దొరికినచో పై చిరునామాకు గాని 9502207540 మొబైల్ నెంబర్‌కు గాని తెలుపగలరు.

ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి- రాయచోటి : ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడూ బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలని సూచించారు.

'చలో వరంగల్'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-పీలేరు

ఈనెల 27న చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు, పీలేరు నియోజకవర్గం ఎంఎస్‌పి ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్ తెలిపారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో పీలేరు నియోజకవర్గ ఎంఎస్‌పి, ఎంఆర్‌పిఎస్ ముఖ్య నాయకుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ మంద క్రిష్ణ మాదిగ, మాదిగ ఉపకులాల ఉజ్వల భవిష్యత్తుకు 30 ఏళ్ల పాటు నిరంతర అలుపెరుగని పోరాటం చేశారని అన్నారు. మంగళవారం పద్మశ్రీ అవార్డును స్వీకరించి, 31న వరంగల్ రానున్న సందర్భంగా, పీలేరు నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాలు, అన్నమయ్య జిల్లాలోని ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, సామాజిక వాదులు వేలాది మంది వరంగల్‌కి చేరుకొని మందకృష్ణ మాదిగకు ఘనస్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి సీనియర్ నాయకులు దొడ్డి వెంకటాచలపతి, ఈపురి వెంకటరమణ, బండ్ల వంక పివి రమణ, గండికోట హుస్సేనయ్య, యువ నాయకులు నరసింహ, రాము, గంగాధర, వినోద్ పాల్గొన్నారు.

పరాకాష్టకు చేరుకున్న రెడ్‌బుక్ రాజ్యాంగం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం పరాకాష్టకు చేరుకుందని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి అన్నారు. సోమవారం వైసిపి కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తుందని, ఈ ఏడాది కాలంలో సూపర్ సిక్స్ హామీలు గాలికి వదిలేసి కక్షపూరిత పనులు చేస్తున్నారని ఆరోపించారు. పల్నాడు జంట హత్య కేసులో ఎలాంటి సంబంధం లేని పిన్నెల్లి సోదరులను కేసులో ఇరికిం చడం చాలా అన్యాయమని అన్నారు. టిడిపికి సంబంధిన ఇరువర్గాలు గొడవ పడి ఒక వర్గం వారిని హత్య చేసినట్లు మృతుడి బంధువులు సాక్ష్యం చెబుతుంటే ఏ సంబంధం లేని వారిపై కేసులు నమోదు చేయడం చూస్తుంటే రెడ్‌బుక్ ఏ విధంగా పనిస్తుందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుస్తోందని అన్నారు. మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని, వల్లభనేని వంశీని బెయిల్ మీద ఉంటే మరొక కేసు బనాయించి అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. పోసాని కృష్ణ మురళిని ఇబ్బంది పెట్టడం, ఇలా పార్టీ నాయకులను ఇబ్బంది పెట్టి వైసిపిని రాష్ట్రంలో లేకుండా చేయాలని చూస్తున్నారని అన్నారు.

ప్రతి ఒక్కరూ యోగాంధ్ర రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రతి ఒక్కరూ యోగాంధ్ర రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ జిల్లా ప్రజలకు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 21న నిర్వహించే కార్యక్రమంలో విశాఖపట్నంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో మే 21 నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర - 2025 క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, యోగాంధ్ర రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌ను https://yogandhra. ap.gov.in/#/ home/launchone లో చేసుకోవాలని తెలిపారు.

డంపింగ్ యార్డును తలపిస్తున్న పెద్దచెరువుకట్ట

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులోని గోరాన్‌చెరువు పంచాయతీ గేటు వద్ద ఉన్న పెద్ద చెరువుకట్ట డంపింగ్ యార్డును తలపిస్తోంది. హోటళ్లు, చికెన్ సెంటర్ల నుంచి వెలువడుతున్న పలు వ్యర్థాలను పెద్ద చెరువు కట్టపై రహదారి వెంబ డి వదిలి వెళ్తున్నారు. వాటి నుంచి వస్తున్న దుర్గంధం, దుర్వాసనలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గాటు నాలుగురోడ్ల కూడలిలో ఉన్న హోటళ్లు, చికెన్ సెంటర్ల నుంచి వెలువడుతున్న వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా రాత్రి సమయాల్లో వాహనాల్లో తెచ్చి రహదారుల పక్కన పారబోస్తున్నారు. వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఆ రహదారిలో వెళ్లే వాహన దారులు, పాదాచారులు దుర్వాసనకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసనతో ఆ దారి వెంట వెళ్లే వారు ముక్కులు మూసుకోవాల్సి వస్తుందని అంటున్నారు. గతంలో స్థానికులు అనేకమార్లు ఫిర్యాదు చేసిన ఫుటికీ, అధికారులు మాత్రం హోటళ్ల,చికెన్ సెం టర్ల యజమానులకు తాఖీదులు ఇచ్చి మమ అనిపించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికా రులు పారిశుధ్యంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెద్దచెరువు కట్టపై ఉన్న చెత్తా చెదారం, వ్యర్థాలు

హత్యా రాజకీయాలను ప్రోత్సహించడమే జగన్ లక్ష్యం

- ఎంపీ అప్పలనాయుడు

మాట్లాడుతున్న ఎంపీ అప్పలనాయుడు

ప్రజాశక్తి - రైల్వేకోడూరు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను జీర్ణించుకోలేకనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. సోమవారం పట్టణంలోని టిడిపి సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ మలిశెట్టి మురళీధర్‌గౌడ్ నివాసంలో అప్పలనాయుడు పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాల రూపకర్తగా సిఎం చంద్రబాబు పనిచేస్తున్నారని, దేశ రాజకీయాల లో చక్రం తిప్పుతూ అటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి విధేయుడిగా రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారని అన్నారు. మొట్టమొదటిసారిగా ఉమ్మడి కడప జిల్లాలో చేపట్టిన మహానాడు కార్యక్రమం విజయవంతంగా జరుగుతుందని, దీనిని జీర్ణించుకోలేక వైసిపి నాయకులు అంతర్మథనంలో పడిపో యారని అన్నారు. వై.ఎస్.జగన్‌కు ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని, ఇప్పటికైనా కళ్లు తెరవాలని అన్నారు. కార్యక్రమంలో అండమాన్ నికోబార్ ఇన్‌ఛార్జి మాణిక్యాలరావు ఉపాధ్యక్షులు మాధవ నాయుడు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే ప్రధాన లక్ష్యం : కెవికె కో-ఆర్డినేటర్

ప్రజాశక్తి-కలికిరి

కెవికె కో-ఆర్డినేటర్ మంజుల

రైతుల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. కెవికె కలికిరి ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని భారత వ్యవసాయ మంత్రిత్వ శాఖ, వ్యవసాయ పరిశోధన మండలి వారి ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం జరపడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్ణయించారని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 29 నుంచి 15 రోజులు పాటు 2025 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ముందస్తు వ్యవసాయ ప్రణాళికగా కెవికె బృందం ఇతర శాస్త్రవేత్తలు, అధికారులతో కలిసి జిల్లాలోని 30 మండలాలను సందర్శించి రైతులతో వ్యవసాయం, ఇతర రంగాలపై చర్చిస్తారని తెలిపారు. వీలైన గ్రామాలలో ఇఫ్కో వారి సహకారంతో డ్రోన్ స్ప్రేయింగ్ ప్రదర్శన కూడా చేపడతారన్నారు. కెవికె శాస్త్రవేత్తలు, పరిశోధనా స్థానాల నుంచి వచ్చే శాస్త్రవేత్తలు నేరుగా రైతులతో వివిధ పంటలలో కొత్తరకం వంగడాలు, సాంకేతికత గురించి అవగాహన కల్పిస్తారని అన్నారు. వ్యవసాయంతో పాటు ఇతర రంగాలైన పశుసంపద, విలువ ఆధారిత ఉత్పత్తులు, సేంద్రీయ వ్యవసాయం మొదలగు అంశాల మీద కూడా చర్చ, సందర్శనలు ఉంటాయని అన్నారు. వివిధ పంటలను సందర్శించి బీడీప డలను, ఇతర సమస్యలను గుర్తించి, నివారణా మార్గాలను తెలుపుతారు. కొత్త సమస్యలకు పరిశోధన చేపట్ట డానికి కార్యాచరణ రూపొందిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులందరూ పాల్గొనాలని తెలిపారు.

1100 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేరుశనగ పంటను సాగు చేయటానికి అవసరమైన 1100 క్వింటాల వేరుశెనగ విత్తన కాయలను మండలానికి ప్రభుత్వం మంజూరు చేసిందని మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ ఆధారంగా రైతులు వేరుశనగ పంటను సాగు చేస్తారని అన్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా సుమారు 2500ఎకరాలకు పైగా రైతులు సాగు చేయడానికి సిద్ధంచేస్తున్నట్లు గుర్తించామని అన్నారు. అందుకు అవసరమైన వేరుశనగ విత్తన కాయలను ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై అందించడానికి చర్యలు చేస్తున్నాదని వివరించారు. 2025 సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు గాను మండలానికి (తెల్ల రకం) కే6-300 క్వింటాలు, (ఎర్ర రకం) నారాయణి -800 క్వింటాలు, మొత్తం 1100 క్వింటాల వేరుశనగ విత్తన కాయలను రైతులకు అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. వేరుశెనగ విత్తన కాయలను ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ పై అందిం చనున్నట్లు తెలిపారు. త్వరలోనే ధరను నిర్ణయించి వెల్లడి స్తామన్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందిన తర్వాత రైతులకు వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేయడానికి చర్యలు చేపడతామని తెలిపారు.

యోగాతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి : యోగా ఆసనాలతో మానసిక ఉల్లాసం పొందవచ్చని ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జడ్పీ హైస్కూల్ (తెలుగు) వ్యాయామ ఉపాధ్యాయులు భద్రయ్య ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు, వైద్య ఆరోగ్య సిబ్బందికి యోగ ఆసనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు యోగా ఆసనాలను చేయడం ద్వారా మనసు ప్రశాంతంగా ఉంటుందని, వ్యాయామంతో శారీరక శ్రమ తగ్గి మనిషి కూడా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. సాధారణ ఆసనాలతో మనిషిలోని అలసట, నిర్లక్ష్యం, బద్ధకం, అనేక ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయన్నారు. మనసు ఏకాగ్రతను పెంచుతుందని తద్వారా మనిషి ప్రతి కార్యములోనూ చురుకుగా పాల్గొంటారని అన్నారు. **పుల్లంపేట :** మండలం కేంద్రమైన పుల్లంపేటలో నేడు ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర లో భాగంగా మహిళా ఆరోగ్య కార్యకర్తలకు అంగన్వాడీ కార్యకర్తలకు, ఆయాలు, ఆశా కార్యకర్తలకు వైద్యాధికారి మనోజ్ చంద్ర, సూర్య నమస్కారాలు నేర్పించి, సాధన చేయించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మనోజ్ చంద్ర మాట్లాడుతూ సూర్య నమస్కారాలు యోగాలో ఒక ప్రధాన భాగమని దీని వల్ల మానసిక ఒత్తిడి తగ్గి, కండరాల మధ్య సమన్వయం పెరుగుతుందని అన్నారు.

మాట్లాడుతున్న శ్రీధర్

మహానాడుకు తరలిరండి

ప్రజాశక్తి-గాలివీడు

ఈనెల 29న కడపలో జరిగే మహానాడు బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావాలని మహానాడు రాయచోటి నియోజకవర్గం పరిశీలకుడు కొమ్మల పాటి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం కొండ్రెడ్డి శ్రీకాంత్‌రెడ్డి గృహం వద్ద ఏర్పాటు చేసిన మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ 25 సంవత్సరాల తర్వాత ఉమ్మడి కడప జిల్లాలో పదికి ఏడు అసెంబ్లీ సీట్లను టిడిపి దక్కించుకుందని అన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పులికుంట సర్పంచ్ పార్థసారథిరెడ్డి, కెడెం లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ బికె.మహమ్మద్ రియాజ్, కొర్లకుంట ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి రెడ్డిప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి. నారాయణరెడ్డి, మిట్టపల్లి, వెంకటరమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

29న దివానే సాహెబ్ ఉరుసు

ప్రజాశక్తి-గాలివీడు : స్థానిక పంచాయతీ పెద్దూరు కస్బా పెద్దచెరువు మొరవలో ఉన్న దివానే సాహెబ్ దర్గా ఉరుసు ఈనెల 29, 30 తేదీలలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు కార్య నిర్వాహకులు ముబారక్ పేర్కొన్నారు. 29న గంధం, పూలతాజియ, చాందినిలతో పకీర్ల మేళ తాళాలతో దర్గా వద్ద ఊరేగింపు నిర్వహిస్తారని చెప్పారు. గురువారం రాత్రి రాత్రి 9 గంటలకు రిహాన్‌అలీ ఖవ్వాలీకి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉరుసు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిం చేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా రమేష్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి : వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రెడ్డప్పగారి రమేష్ కుమార్ రెడ్డి 60 వ పుట్టిన రోజు వేడుకలు లక్కిరెడ్డిపల్లిలోని తన నివాసంలో ఘనంగా నిర్వహించారు. అన్నమయ్య జిల్లా ఎంపిపి సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపిపి అంబాబత్తిన రెడ్డెయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాలడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి ఉమాపతి రెడ్డి, రాయచోటి మాజీ మండల అధ్యక్షులు సుబ్బారెడ్డి, మండల వైసిపి కన్వీనర్ యదు భూషన్‌రెడ్డి, నాయకులు ఆయనను గజమాలతో సత్కరించారు.

పరిష్కారం కాని తాగునీటి సమస్య

ప్రజాశక్తి -గోపవరం : మండలంలోని ఎస్. రామాపురం గ్రామం పెద్ద దళితవాడకు చెందిన ప్రజలు తాగునీటి కోసం మూడు నెలల నుండి పోరాటం చేస్తున్నా పరిష్కారం కాలేదు. ఎవరు తమ సమస్యను పట్టించుకో వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల చుట్టూ తిరుగుతూ తమ సమస్యను చెప్పు కున్నా, ఇప్పటికీ మూడు నెలలు కావస్తున్నా తమ గోడు వినిపించుకునే నాయకుడు కానీ, అధికారులు కానీ లేరని పేర్కొన్నారు. బోరు చెడిపోవడంతో మంచినీటి కోసం మూడు నెలలుగా అల్లాడుతున్నారని వారు అన్నారు. సంబంధిత అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం లేకపోయింది. ఈ విషయంలో రాజకీయ రంగు పులుముకొని బోరు పైపులైన్లను వేరే వర్గం అక్రమిత పొలంలో ఉండడం వల్ల దళితులకు నీరు ఇవ్వడంలో జాప్యం అవుతోంది. వెంటనే అధికారులు స్పందం చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కార్యకర్తలను పరామర్శిస్తున్న నిస్సార్ అహ్మద్

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం : 'నిస్సార్'

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మదనపల్లి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ సోమవారం మండలంలో పర్యటించారు. నిమ్మనపల్లె పంచాయతీ, బోడిమల్లయ్యగారి పల్లెకు చెందిన వైసిపి సీనియర్ కార్యకర్త మహమ్మద్ ఖాసిం ఖాన్ తండ్రి అబ్దుల్ రజాక్ హఠాత్తుగా మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన బోడిమల్లయ్యగారిపల్లెలో పర్యటించి అబ్దుల్ రజాక్ పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఎల్లప్పుడు కార్యకర్తలకు అండగా నిలబడుతుందని గుర్తు చేశారు. కుటుంబ పెద్దను కోల్పోయిన ఖాసింఖాన్‌కు తాను అండగా ఉంటానన్నారు. కార్యకర్తలు ప్రతి పనిలోనూ మనో ధైర్యంతో ముందుకు సాగాల న్నారు. నియోజకవర్గంలో తాను కార్యకర్తల కోసం 24 గంటలు అందుబాటులో ఉంటా నని, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాను బాధ్యత వహిస్తానని పేర్కొన్నారు. కార్యక్ర మంలో మండల కార్యదర్శి ఎస్.ఖాదర్‌బాషా, మల్లికార్జున, రెడ్డిభాస్కర, భాషా సాహెబ్, అబ్దుల్, యాసిన్, సాదిక్, నూర్ మహమ్మద్ పాల్గొన్నారు.

టమోటా పంటను పరిశీలిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

నేరేడు, టమోటా పంటల పరిశీలన

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె.మంజుల, శాస్త్రవేత్తలు , సిబ్బంది మండలంలోని నగిరిపల్లిలో అల్లనేరేడు, టమోటా పంటలను సందర్శించారు. నేరేడులో కాండం మొదట్లో బీటలు వాడడం గమనించారు. దీనికి కారణం వివిధ రకాల తెగుళ్ల సమూహమని తెలిపారు. దీని నివారణకుగాను బోర్డో పేస్టు తయారు చేసుకుని మొదలపై చీలికలు ఉండే భాగం వరకు పూయాలని సిఫారసు చేశారు. తోటను అవసరం మేర కొమ్మ కత్తిరింపులు చేసి, కలుపు మొక్కలు నివారించుకుంటూ సంవత్సరం పొడుగునా శుభ్రంగా ఉంచాలని సూచించారు. అప్పుడప్పుడు, వేప సంబంధిత మందు లను పిచికారి చేయాలని సూచించారు. టమాటా పంటను సందర్శించి భాస్వరం లోపం అధికంగా ఉండడం వలన ఆకులపై అంచులు పైకి ముడుచుకొని అంచుల ఊదా రంగుకు మారడం రైతుకు వివరించారు. దీని నివారణకు గాను 12:61:00 అనే మందును డ్రిప్ ఎరువును మూడు కేజీలు ఒక ఎకరాకు వదలాలని సూచించారు. కార్యక్రమంలో కెవికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఐగా ప్రసాద్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలం నూతన ఎస్ఐగా వివిఎల్ ప్రసాద్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఎస్ఐగా పని చేసిన నవీన్ కుమార్ బాబు బదిలీపై చిట్వేలి మండలానికి వెళ్ళగా ఆస్థానంలో ప్రసాద్‌రెడ్డి బాధితులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతి భద్రతలో పరి రక్షణలో అందరి సహకారం అవసరమని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామని పేర్కొన్నారు.

శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాడాలి

మాట్లాడుతున్న వై.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాడాలని ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత మాజీ అధ్యక్షులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు స్థానిక విశ్వం కళాశాలలో రెండవ రోజుతో ముగిసాయి. రెండవ రోజు ముఖ్య అతిథిగా హాజరైన వై.వెంకటేశ్వరరావు మాట్లా డుతూ విద్యార్థి లోకం శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాటాలు నిర్వహిం చాలని పిలుపు నిచ్చారు. ఎస్‌ఎఫ్‌ఐ నినాదం అధ్యయనం పోరాటంతో విద్యార్థులను ఐక్యం చేయా లని, విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటి కప్పుడు అర్థం చేసుకుంటూ పోరాటాలకు సన్నద్ధం కావాలని తెలిపారు. దేశంలో మోడీ ప్రభుత్వం విద్యలో కార్పొరేటీకరణ, కేంద్రీకరణ, కాషాయీకరణ దిశగా అడుగులు వేస్తూ, పాఠ్యాంశాలలో వాస్తవ చరిత్రను కాలరాస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలు నేటికి అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థలపై నియంత్రించాల్సిన ప్రభుత్వం వారికి రెడ్ కార్పెట్ పరుస్తుందని విమర్శించారు. విద్యార్థులకు బట్టీ చదువులు కాకుండా శాస్త్రీయమైన విద్యే ఉండాలని సూచించారు.

ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత మాజీ అధ్యక్షులు వై.వెంకటేశ్వరరావు

రాష్ట్ర నూతన అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

రాష్ట్ర ప్లీనరీ సమావేశాల సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నూతన అధ్యక్షులుగా పి.రామ్మోహన్, కార్యదర్శిగా కె.ప్రసన్న కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు పావని, రాష్ట్ర ఉపాధ్యక్షులు పరమేష్, వెంకటేశ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, రమణ రాష్ట్ర నలుమూల నుండి వచ్చిన 26 జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి-రామాపురం

ఉపాధి పని ముగించుకొని ఇంటికి వెళుతుండగా మారుమధ్యలో గుండెపోటుతో కూలీ టేకూరి రెడ్డయ్య (65) మృతి చెందారు. వివరాలలోకి వెళితే...అన్నమయ్య జిల్లా రామాపురం మండలంలోని రాచపల్లి పంచాయతీ ఎగువఉప్పరపల్లికు చెందిన రెడ్డయ్య రోజువారీగా సోమవారం ఉపాధి పనికి వెళ్లారు. పని ముగించుకొని ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో చాతిలోనే నొప్పిగా ఉందని కుప్పకూలిపోయాడు తోటికూలీలు ఏంజరిగిందని తెలుసుకునేలోపు రెడ్డయ్య మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రెడ్డయ్య మృతి సమాచారాన్ని ఉపాధి సిబ్బందికి తెలియజేశారు ఉపాధి సిబ్బంది హుటాహుటిన ఎగువ ఉప్పరపల్లికు వెళ్లి రెడ్డెయ్య మరణ వార్తను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రెడ్డెయ్య కుటుంబానికి ప్రభుత్వం నుండి అందవలసిన ఆర్థిక సాయం అందేలా చర్యలు చేపడతామని తెలిపారు

మృతి చెందిన రెడ్డయ్య (ఫైల్ ఫోటో)